సాక్షి విజయనగరం

సోమవారం | 27 | మే | 2024



పేదల ఆరోగ్య ప్రదాయిని...

జిల్లా ఆస్పత్రిని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిగా మార్చడంతో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయి.

- 8లో



కీటక జనిత వ్యాధులకు చెక్..

కీటక జనిత వ్యాధుల నియంత్రణ కార్యక్రమం పార్వతీపురం మన్యం జిల్లాలో ముమ్మరంగా కొనసాగుతోంది.

- 8లో



ఘనంగా ఘటాల ఊరేగింపు

భామిని: మండలంలోని దిమ్మిడిజోలలో నిర్వహిస్తున్న శ్రీ పెద్దమ్మతల్లి గ్రామ దేవత సంబరాల్లో భాగంగా ఆదివారం ఘటాల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు.

న్యూస్‌రీల్

తగ్గిన మడ్డువలస నీటిమట్టం



మడ్డువలస ప్రాజెక్టు

వంగర: మడ్డువలస గొర్లె శ్రీరాములునాయుడు ప్రాజెక్టు వద్ద నీటిమట్టం గణనీయంగా తగ్గింది. ఈ ఏడాది రబీసీజన్‌కు పూర్తిస్థాయిలో 10వేల ఎకరాలకు సాగునీరు సరఫరా చేయడంతో కొంతమేర నీరు ఆయకట్టుకు వినియోగించారు. దీంతో ప్రస్తుతం 62.65 మీటర్ల నీటి నిల్వ నమోదైంది. ఈ ప్రాజెక్టు నీటిమట్టం 65 మీటర్లు కాగా వర్షాల లేమి, ఇన్‌ఫ్లో లేకపోవడంతో ప్రాజెక్టు పరిసర ప్రాంతం నీరులేక వెలవెలబోతోంది. రానున్న ఖరీఫ్ సీజన్‌కు సాగునీరందించేందుకు ప్రాజెక్టులో 1.4 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. వర్షాలు కురిస్తే నీటినిల్వలు ప్రాజెక్టులోకి వచ్చి చేరుతాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

బిత్రపాడులో ఏనుగులు



బిత్రపాడు పంట పొలాల్లో ఏనుగులు

జియ్యమ్మవలస: మండలంలోని బిత్రపాడు గ్రామ సమీపంలో ఆదివారం ఏనుగులు దర్శనమిచ్చాయి. మధ్యాహ్నం వరకు నాగావళి నదిలో ఉండి అనంతరం పామాయిల్ తోటలో తిష్ఠ వేశాయి. అరటి, పామాయిల్ తోటలను ఏనుగులు ధ్వంసం చేస్తున్నాయని అటవీ శాఖాధికారులు వాటిని తరలించే ప్రయత్నం చేయాలని రైతులు కోరుతున్నారు. రాత్రి సమయాన పంట పొలాలలకు వెళ్లడానికి భయపడుతున్నామని అటవీ సిబ్బంది తగుచర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కళ్లికోట చేరుకున్న గజరాజులు

కొమరాడ: ఇటీవల నాగావళి నది ఆవైపు ఉన్న గ్రామాల్లో సంచారం చేసిన ఏడు గజరాజుల గుంపు ఆదివారం కళ్లికోట, దుగ్గి గ్రామ పరిసరాల్లోకి చేరుకుంది. దీంతో కళ్లికోట,దుగ్గి, గుణానుపురం తదితర గ్రామాల ప్రజలు వేసవికాలం నేపథ్యంలో గ్రామాల్లో రాత్రిపూట బయట పడుకోవద్దని ఏనుగులు చొరబడే పరిస్థితి ఉందని జాగ్రత పాటించాలని అటవీశాఖ సిబ్బంది ఆయా సూచిస్తున్నారు. రైతులు పొలాల్లోకి వెళ్లవద్దని హెచ్చరిస్తున్నారు. ఏనుగులు కనపడితే కవ్వింపు చర్యలకు పాల్పడవద్దని హితవు పలుకుతున్నారు.

రామతీర్థంలో ప్రత్యేక పూజలు



యాగశాలలో హోమం జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: వైశాఖ మాసాన్ని పురస్కరించుకుని పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు కొనసాగుతున్నాయి. వేకువజామున స్వామికి ప్రాతఃకాలార్చన, బాలభోగం నిర్వహించిన తరువాత యాగశాలలో విశేష హోమాలు జరిపించారు. అనంతరం వెండి మంటపం వద్ద స్వామి నిత్య కల్యాణ మహోత్సవం జరిపించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి తరలివచ్చిన భక్తులతో రామతీర్థం పరిసర ప్రాంతాలు కిటకిటలాడాయి. ఆదివారం కావడంతో పలువురు సందర్శకులు బోడికొండపై సందడి చేశారు.

మహిళల క్రికెట్ జట్ల ఎంపికకు స్పందన



ఎంపిక పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులకు సూచనలు ఇస్తున్న కోచ్

విజయనగరం: జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన జిల్లాస్థాయి మహిళల క్రికెట్ జట్టు ఎంపిక పోటీలకు స్పందన లభించింది. నగర శివారులో గల విజ్జి స్టేడియంలో అండర్ -15, అండర్-19, సీనియర్స్ విభాగాల్లో నిర్వహించిన ఎంపిక పోటీలకు జిల్లా అనుమానం నుంచి 60 మంది క్రీడాకారిణులు హాజరయ్యారు. వారికి అసోసియేషన్ కార్యదర్శి ఎంఎల్ఎన్ రాజు ఆధ్వర్యంలో పలువురు కోచ్‌లు ఎంపిక పోటీలు నిర్వహించారు. క్రీడాకారులకు బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ విభాగాల్లో వ్యక్తిగత సామర్థ్య పరీక్షలు నిర్వహించి అందులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి జిల్లా జట్టులో స్థానం కల్పించారు. మూడు విభాగాల్లో జరిగిన ఎంపిక పోటీల్లో ఒక్కో జట్టుకు 15 మంది చొప్పున క్రీడాకారులను ఎంపిక చేసినట్టు అసోసియేషన్ కార్యదర్శి రాజు తెలిపారు.

రాజాం సిటీ: విశాలమైన క్రీడామైదానం ఉన్న సంతకవిటి కళాశాల



కాలేజీకి పోదాం పద..!

పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకునేందుకు సమయం ఆసన్నమైంది. ఇంటర్‌మీడియట్‌లో ప్రవేశించి కళాశాలలో అభ్యసించే చదువు, చూపించే ప్రతిభ..ఉన్నతోద్యోగాలు సాధించేందుకు మార్గం చూపిస్తుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ కళాశాలల్లో చేరాలని విద్యార్థులకు పిలుపునిస్తూ జూనియర్ కళాశాలల అధ్యాపకులు గ్రామాల్లో ప్రచారం ప్రారంభించారు. కళాశాలల్లో ఉన్న వసతులపై అవగాహన కల్పిస్తున్నారు.

- ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి వేళాయె
- ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ కళాశాలల క్యాంపెయినింగ్

రాజాం సిటీ/పార్వతీపురం టౌన్:

ఈ ఏడాది ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు వేళయింది. ఈ నెల 31 వరకు మొదటి విడత ప్రవేశాలు కల్పించడంతోపాటు జూన్ 1 నుంచి తరగతులు నిర్వహించేందుకు ఇంటర్మీడియట్ బోర్డు కార్యాచరణ చేపట్టింది. రెండో విడత ప్రవేశాలు జూన్ 1 నుంచి 15వ తేదీ వరకు చేపట్టనున్నారు.

ప్రైవేట్‌కు దీటుగా ప్రచారం

ప్రైవేట్ కళాశాలల్లో అడ్మిషన్లు పెంచేందుకు ఆయా యాజమాన్యాలు సిబ్బందితో ప్రచారం నిర్వహించడం పరిపాటిగా మారింది. అయితే వారికి దీటుగా ఇప్పుడు ప్రభుత్వ కళాశాలల అధ్యాపకులు సైతం ప్రభుత్వ, వివిధ సంక్షేమ శాఖల పరిధిలోని కళాశాలల్లో ప్రవేశాలు పెంపుదలకు ఇంటర్మీడియట్ విద్యాశాఖ ఇప్పటికే ప్రచారం మొదలు పెట్టింది. అలాగే కళాశాలల్లో సాధించిన ప్రగతి, వసతులు, అందిస్తున్న కోర్సులను కరపత్రాల ద్వారా వివరిస్తున్నారు. గ్రామాల్లో పదో తరగతి పూర్తిచేసుకున్న విద్యార్థుల వివరాలు సేకరించి వారి తల్లిదండ్రులతో మాట్లాడుతూ కళాశాలల్లో ఉన్న వసతులపై వివరిస్తున్నారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు కళాశాల పనివేళల్లో వచ్చి దరఖాస్తు చేసుకుని నేరుగా ప్రవేశాలు పొందవచ్చు. దరఖాస్తుతోపాటు అవసరమైన సర్టిఫికెట్లు, జిరాక్స్‌లు, ఆధార్‌కార్డులు, బ్యాంకు అకౌంట్ జిరాక్స్‌లు, పాస్‌పోర్టు సైజు ఫొటోలను తీసుకురావాల్సి ఉంటుంది.

కాలేజీల్లో మెరుగైన సౌకర్యాలు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం విద్యావ్యవస్థను మెరుగుపర్చేందుకు నాడు-నేడు కార్యక్రమం చేపట్టింది. ఇందులో భాగంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా ఉండేందుకు అన్ని సౌకర్యాలు ఏర్పాటుచేసింది. ప్రస్తుతం ప్రతి కళాశాలలో అనుభవం కలిగిన అధ్యాపకులు, విశాలమైన తరగతి గదులు, అధునాతన ప్రయోగశాలలు, క్రీడాస్థలం మంచినీటి వసతి, మరుగుదొడ్లు ఉన్నాయి. వాటితోపాటు బస్‌పాస్ సౌకర్యం, హాస్టల్ వసతి, స్టడీ అవర్స్ నిర్వహణతోపాటు విద్యార్థుల్లో సేవా భావం పెంపొందించేందుకు ఎన్ఎస్ఎస్ కార్యక్రమం అమలు చేస్తున్నారు.

జూన్ 1 నుంచి తరగతులు..



ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో కళాశాలల్లో సీట్లు పెంపుదలకు కృషి చేస్తున్నాం. ఇప్పటికే అన్ని కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులకు దిశానిర్దేశం చేశాం. ఈ ఏడాది తరగతులు జూన్ 1 నుంచి ప్రారంభం కానున్నాయి. అన్ని కళాశాలల్లో రెండు విడతలుగా అడ్మిషన్లు చేపడుతున్నాం. మొదటి విడత ఈ నెల 31 వరకు రెండో విడత జూన్ 1 నుంచి 15 వరకు అడ్మిషన్లు జరగనున్నాయి. పదో తరగతి పాసైన విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

–ఎం.ఆదినారాయణ, ఆర్ఐఓ, విజయనగరం

ముమ్మరంగా ప్రచారం చేస్తున్నాం



కళాశాలలో అడ్మిషన్ల పెంపునకు గ్రామాల్లో ముమ్మరంగా ప్రచారం నిర్వహిస్తున్నాం. ప్రతిరోజూ విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారికి కళాశాలలో వసతుల గురించి వివరించడంతోపాటు కళాశాలలో చేరే విధంగా అవగాహన కల్పిస్తున్నాం. కోర్సుల వివరాలు, సీట్ల సంఖ్య తదితర వాటిపై విద్యార్థులతోపాటు తల్లిదండ్రులకు వివరిస్తున్నాం.

–కె.జనార్దనరావు, ప్రిన్సిపాల్,బాలికల జూనియర్ కళాశాల, రాజాం

విజయనగరం జిల్లాలో కళాశాలలు..	
ప్రభుత్వ కళాశాలలు	18
ప్రైవేట్ కళాశాలలు	106
కేజీబీవీలు	26
మోడల్ స్కూల్ కళాశాలలు	12
ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌జేసీలు	8
ఏపీఆర్‌జేసీ	1
ఎంజేపీఏపీబీసీడబ్ల్యూఆర్‌జేసీ	1
హైస్కూల్ ప్లస్	8
ఒకేషనల్ కళాశాలలు	23
పార్వతీపురం మన్యం జిల్లాలో..	
ప్రభుత్వ జూనియర్ కళాశాలలు	14
ప్రైవేట్ కళాశాలలు	34
కేజీబీవీలు	14
మోడల్ కళాశాలలు	4
సోషల్ వెల్ఫేర్	2
ట్రైబల్ వెల్ఫేర్	3
హైస్కూల్ అండ్ జూనియర్ కళాశాలు (ఒకేషనల్)	4



రాజాం సిటీ: విద్యార్థినికి పాంప్లెట్ అందించి ప్రచారం చేస్తున్న రాజాం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల అధ్యాపకులు

అనుమానాస్పద వ్యక్తులపై నిఘా

విజయనగరం క్రైమ్: అనుమానాస్పద వ్యక్తులపై ప్రత్యేక నిఘా పెట్టేందుకు టూటౌన్ పరిధిలో ఉన్న వైఎస్సార్ నగర్‌లో ఆదివారం వేకువజామున టూటౌన్ సీఐ కోరాడ రామారావు నేతృత్వంలో జిల్లా పోలీసులు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. అనుమానాస్పద వ్యక్తుల కదలికల గురించి, రికార్డులు సక్రమంగా లేని వాహనాలు, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు కాలనీలోని ప్రతి ఇంటి పరిసరాల్లో, వీధుల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. అనుమానాస్పద వ్యక్తుల్ని ప్రశ్నించి, వారు ఎవరింటికి, ఏ పని మీద వచ్చారన్న విషయాలపై ఆరా తీశారు. అదేవిధంగా వాహన రికార్డులు సక్రమంగా లేని 31 మోటార్‌సైకిళ్లను స్టేషన్‌కు తరలించారు. వాహనపత్రాలు పరిశీలించి, పత్రాలు సక్రమంగా ఉన్న వాహనాలను రిలీజ్ చేస్తామని, రికార్డులు సక్రమంగా లేని వాహనాలను సీజ్ చేసి, చట్టపరమైన చర్యలు చేపడతామని టూటౌన్ సీఐ కోరాడ రామారావు స్పష్టం చేశారు. అనుమానాస్పద వ్యక్తులపై నిఘా ఏర్పాటుచేసేందుకు ఎస్పీ ఎం.దీపిక ఆదేశాలతో కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించామన్నారు. భవిష్యత్తులో మరికొన్ని ప్రాంతాల్లో ఇదే తరహా ఆపరేషన్స్ చేపడతామని చెప్పారు. కార్డన్ సెర్చ్‌లో ఎస్సైలు దుర్గాప్రసాద్, రాజేష్, ఏఎస్సై పైడితల్లి, సిబ్బంది పాల్గొన్నారు.



కార్డన్‌సెర్చ్‌లో భాగంగా వైఎస్సార్ నగర్‌లో సిబ్బందికి సూచనలు చేస్తున్న టూటౌన్ సీఐ కోరాడ రామారావు

ధారగంగమ్మ నిజరూప దర్శనం



ధారగంగమ్మకు జలాభిషేకం చేస్తున్న భక్తులు

- పోటెత్తిన భక్తజనం
- అమ్మవారికి వేలాది బిందెలతో జలాభిషేకం
- నేడు తొలేళ్ల ఉత్సవం
- అనుపోత్సవం రేపు

శృంగవరపుకోట:

పట్టణ ప్రజల ఆరాధ్యదైవం, గ్రామదేవత ధారగంగమ్మ అమ్మవారి నిజరూప దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు. ఆదివారం తెల్లవారుజామునుంచి అమ్మవారి ఉత్సవ మూర్తికి ఆలయ అర్చకులు అగ్నిహోత్రం రాజగోపాలచార్యులు, గార్లపాటి మూర్తి మంత్రోచ్చారణతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి మహిళలు జలాభిషేకం చేశారు. అమ్మవారి అనువంశిక పూజారి మోపాడ గౌరినాయుడు దంపతులు, పుణ్యగిరి దేవస్థానం ట్రస్టుబోర్డు ఛైర్మన్ పాలమరశెట్టి రామకృష్ణ, ఎస్.కోట ఉపసర్పంచ్ మోపాడ కుమార్, ఉత్సవ కమిటీసభ్యులు రామోదర కృష్ణం నాయుడు, డబ్ల్యూఎస్‌శర్మ, వి.స్వామినాయుడు, వి.రాజు, మోపాడ మధు, డైరెక్టర్లు ఈశ్వర్రావు, జి.శ్రీను, వార్డుసభ్యుడు మజ్జి శేఖర్ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు శ్రీనివాస ఫోటో స్టూడియో యాజమాన్యం మజ్జిగ పంపిణీ చేసింది.

నేడు అమ్మవారి తొలేళ్ల ఉత్సవం

పట్టణంలో సోమవారం అమ్మవారి తొలేళ్ల ఉత్సవం నిర్వహించనున్నారు. అనువంశిక పూజారి గౌరునాయుడు ఇంటినుంచి చుక్కవీధిలో ఉన్న బి.గంగయ్య ఇంటివద్దకు చేను కుండలో వరి విత్తనాలు పట్టుకుని ఊరేగింపుగా వెళ్లి గాంధీబొమ్మ జంక్షన్ పాండవుల చావిడి వద్ద ఈ విత్తనాలు పోస్తారు. పూర్వీకుల సంప్రదాయంగా వస్తున్న ఈ విత్తనాలను ఖరీఫ్ చల్లే విత్తనాల్లో కలిపి నారుమడిలో చల్లుతారు. ఈ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా సీఐ ఎం.మురళీరావు, ఎస్సై సీహెచ్ గంగరాజుల నేతృత్వంలో 200 మంది పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు.

అనుపోత్సవం రేపు

గ్రామదేవత ధారగంగమ్మ అమ్మవారి పండగ అనుపోత్సవం మంగళవారం నిర్వహిస్తారు. అమ్మవారికి ముందుగా అనువంశిక పూజారి మోపాడ గౌరి ఇంటి నుంచి గొల్లవీధిలో గల ధారగంగమ్మ అమ్మవారి గద్దె గుడికి వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. పద్మశాలి వంశీకులు అమ్మవారి భారీ ప్రభను ప్రదర్శిస్తారు. ఈ పండుగకు సుమారు లక్షమంది భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకునే అవకాశముందని స్థానికులు చెబుతున్నారు.



భక్తులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న శ్రీనివాస ఫొటో స్టూడియో యాజమాన్యం

ప్రత్యేక పిల్లల్లో.. మానసిక వికాసం

- భవిత కేంద్రంతో బంగారు భవిష్యత్
- ప్రత్యేక అవసరాల పిల్లలకు ఆటపాటలతో విద్య
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 34 కేంద్రాలు
- తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు
- ఇంటింటి ప్రచారంతో సత్ఫలితాలు

రామభద్రపురం:

అందరి పిల్లల్లా మా బిడ్డలు చక్కగా ఎదగాలి. చదువుకోవాలి, ఆడుకోవాలని ఏ తల్లిదండ్రులైనా ఆశపడతారు.అదే మానసిక ఎదుగుదల లేని చిన్నారుల తల్లిదండ్రులైతే తమ బిడ్డల భవిష్యత్ కోసం ఆలోచన చేస్తూ వారి ఎదుగుదలపై నిత్యం ఆందోళన చెందుతూ ఉంటారు. అయితే అలాంటి చిన్నారుల కోసమే రాష్ట్ర ప్రభుత్వం ప్రతి మండల కేంద్రంలో భవిత కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఈ భవిత కేంద్రం ద్వారా ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారుల అభివృద్ధికి పలు కార్యక్రమాలు చేపడుతున్నారు. ఆటపాటలతో కూడిన విద్యాబోధన, స్పీచ్ థెరపీ, ఫిజియోథెరపీ సేవలందిస్తున్నారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలో 34 భవిత కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ కేంద్రాల్లో ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులు ఆటపాటలతో కూడిన విద్యతో పాటు ఫిజియోథెరపీ సేవలు పొందుతున్నారు. ఈ క్రమంలో ఈ ఏడాది విద్యార్థుల సంఖ్యను పెంచడమే లక్ష్యంగా ప్రత్యేక ఉపాధ్యాయులు, ఐఈఆర్టీలు ఇంటింటికీ వెళ్లి ఇప్పటివరకు చదువుకు దూరంగా ఉన్న వారితో పాటు మధ్యలో చదువు మానేసిన ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపు సర్వే చేస్తున్నారు. దివ్యాంగ చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. దివ్యాంగ చిన్నారుల చదువుకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, భవిత కేంద్రాలలో కల్పిస్తున్న మౌలిక వసతులు, ఆటపాటలతో కూడిన విద్యాబోధన ఉంటుందని వివరిస్తున్నారు. దాంతో పిల్లలను చేర్పడానికి తల్లిదండ్రులు ఆసక్తి చూపుతుండడంతో ఏటా భవిత కేంద్రాల్లో చిన్నారుల చేరికలు పెరుగుతున్నాయి.



రామభద్రపురం భవిత కేంద్రం



భవిత కేంద్రంలో చేర్పించాలని అవగాహన కల్పిస్తున్న ఐఈఆర్టీ సీహెచ్ రాజేశ్వరి

భవిత కేంద్రంతో ప్రయోజనాలు

మానసిక వైకల్యం, చెవుడు, మూగ, పోలియో తదితర లోపాలతో జన్మించి భవిత కేంద్రంలో చేరిన పిల్లలకు అర్థమయ్యే రీతిలో ఆట పాటలతో కూడిన విద్యను అందజేసి వారిలో మనోధైర్యాన్ని నింపుతూ భవిష్యత్‌పై ఆశలు నింపుతున్నారు. వినూత్న కార్యక్రమాలతో సాధారణ పిల్లల్లాగానే వారు చదువుకునేలా, ఆడుకునేలా మార్పు తీసుకురాగలుగుతున్నారు. ఇందుకుగాను ప్రతి కేంద్రంలో ఇద్దరు సీఆర్టీలను ప్రభుత్వం నియమించి వారి ద్వారా పాఠశాల సంసిద్ధత, స్పీచ్, విజన్ థెరపీ, ఎర్లీ ఇంటర్వెన్షన్ వంటి కార్యక్రమాలతో చిన్నారులకు సేవలందిస్తూ దివ్యాంగుల ఎదుగుదలను మెరుగుపరుస్తున్నారు.

ప్రత్యేక డిజిటల్ బోధనకు సిద్ధం

దివ్యాంగ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే సదుద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక డిజిటల్ విద్యాబోధన ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నారు.పాఠశాలల్లోని సాధారణ విద్యార్థులతో సమానంగా ప్రత్యేక అవసరాల పిల్లలను సాంకేతికంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక యాప్‌లతో కూడిన ట్యాబ్‌లను పంపిణీ చేయనున్నారు. 7వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు వాటిని పంపిణీ చేయనున్నట్లు అధికారిక సమాచారం. ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు బోధనకు అనువుగా ట్యాబ్‌లో సాఫ్ట్‌వేర్ లేకపోవడంతో ఈ విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని గుర్తించిన ప్రభుత్వం వాటి స్థానంలో వినికిడి, దృష్టి లోపం ఉన్న విద్యార్థులందరికీ ఉపయోగపడేలా ప్రత్యేక సాఫ్ట్‌వేర్ పొందుపరిచిన ట్యాబ్‌లను పంపిణీ చేయనుంది.

ఫిజియోథెరపీతో శారీరక సేవలు

ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులకు పాఠశాల విద్యతో పాటు వారంలో ఒక రోజు వారి శారీరక అవసరాలను బట్టి ఫిజియోథెరపీ సేవలను అంది స్తున్నారు. దీని ద్వారా దివ్యాంగ పిల్లల్లో శారీరక మార్పు జరిగి సాధారణ పిల్లల్లా తయారవుతున్నా రు. అలాగే అవసరాన్ని బట్టి చెవుడు, మూగ, పోలి యో వంటి ఆయా శారీరక రుగ్మతలకు ప్రత్యేక శస్త్ర చికిత్సలు చేయిస్తున్నారు. దీంతో పాటు దివ్యాంగ పిల్లలను భవిత కేంద్రాలకు తీసుకొచ్చే తల్లిదండ్రులకు ఎస్కార్ట్, ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్‌లు ఇస్తున్నారు. అలాగే ఆడపిల్లలకు స్టైపెండ్ ఇస్తున్నారు. భవిత కేంద్రాలకు రాలేని పిల్లల ఇంటి దగ్గరకు ఐఈఆర్టీలు వెళ్లి వారికి విద్యను అందిస్తూ తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నారు.



భవిత కేంద్రంలో ఫిజియోథెరపీ అందిస్తున్న వైద్యాధికారి

ప్రత్యేక విద్యను అందిస్తున్నాం



గ్రామాల్లో ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులను గుర్తించి వారికి భవిత కేంద్రం ద్వారా ప్రత్యే విద్యను అందిస్తున్నాం.చిన్నారులకు ఆట పాటల ద్వారా విద్యను అర్థమయ్యే రీతిలో అందిస్తున్నాం. చిన్నారుల్లో రోజురోజుకు పురోగతి ఉండడంతో తల్లిదండ్రులు సంతోషంతో తమ పిల్లలను కేంద్రాల్లో చేర్పిస్తున్నారు.

–ఎస్.సూర్యారావు, జిల్లా సహిత విద్య కో ఆర్డినేటర్

సద్వినియోగం చేసుకోవాలి..



దివ్యాంగ చిన్నారుల భవిష్యత్‌కు చక్కని మార్గం భవిత కేంద్రం. ఇంటింటికీ వెళ్లి దివ్యాంగ చిన్నారులను గుర్తించి వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తూ ఈ కేంద్రాల్లో చేర్పిస్తున్నాం. చిన్నారుల్లో శారీరక ఎదుగుదల మెరుగుపడి వారి పనులు చేసుకోగలిగే స్థాయికి వస్తున్నారు. ఈ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి.

–ఎన్ ప్రేమ్‌కుమార్, డీఈవో విజయనగరం

క్లుప్తంగా

నేడు స్వయం ఉపాధి శిక్షణకు ఇంటర్వ్యూలు

రాజాం: పట్టణంలోని జీఎంఆర్ నగర్‌లో గల జీఎంఆర్ నాగావళి ఉచిత స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (నైరేడ్)లో పలుకోర్సుల్లో శిక్షణ పొందేందుకు సోమవారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఆ సంస్థ ప్రతినిధులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పురుషులకు 75 రోజుల రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండీషనింగ్.. 30 రోజుల ఎలక్ట్రికల్ అండ్ హౌస్ వైరింగ్.. 30 రోజుల ఫొటోగ్రఫీ అండ్ వీడియోగ్రఫీలో శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. మహిళలకు 30 రోజుల హోమ్ నర్సింగ్ (శిక్షణ అనంతరం ఇండియన్ రెడ్‌క్రాస్ సాయంతో హైదరాబాద్‌లో జాబ్).. 30 రోజుల లేడీస్ టైలరింగ్.. 30 రోజుల మగ్గం వర్క్.. 45 రోజుల డీటీపీ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. లేడీస్ టైలరింగ్‌కు 5వ తరగతి అర్హత, మిగిలిన వాటికి స్త్రీ, పురుష అభ్యర్థులు పదోతరగతి ఉత్తీర్ణతతో పాటు 19 నుంచి 40 సంవత్సరాల లోపు వయసు కలిగి ఉండాలని నిర్వాహకులు వెల్లడించారు. శిక్షణ సమయంలో భోజన, వసతి సదుపాయాలు ఉంటాయని, ఎస్ఎస్‌సీ మార్క్స్ లిస్ట్, ఆధార్ కార్డు జిరాక్స్‌లతో సోమవారం ఉదయం 9.30 గంటలకు నేరుగా రాజాంలోని నైరేడ్‌లో హాజరుకావాలని సూచించారు. వివరాలకు 90147 16255, 94917 41129 నంబర్లను సంప్రదించాలని కోరారు.

అదృశ్యంపై కేసు నమోదు


హరికామేశ్వరరావు

కొత్తవలస: మండలంలోని రామచంద్రాపురం గ్రామానికి చెందిన కురిటి హరి కామేశ్వరరావు (32) అదృశ్యంపై ఆయన తల్లి రమణమ్మ ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుదర్శన్ తెలిపారు. వివరాల్లోకి వెళితే... హరి కామేశ్వరరావు ఈ ఏడాది జనవరి 8వ తేదీన ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అప్పుడప్పుడు కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడేవాడు గాని ఎక్కడ ఉన్నదీ చెప్పేవాడు కాదు. అయితే ఈ నెల మొదటి వారం నుంచి కుటుంబ సభ్యులకు ఫోన్ కూడా రావడం లేదు. అప్పటి నుంచి వెతుకుతున్నా ఫలితం లేకపోవడంతో యువకుడి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

- ఈ నెల 22 నుంచి మరొకరు..


బంగారు నాయుడు

పూసపాటిరేగ: పూసపాటిరేగ పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు పిన్నింటి బంగారునాయుడు (72) కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎ. సన్యాసినాయుడు తెలిపారు. బంగారునాయుడు ఈ నెల 22వ తేదీ ఉదయం 9 గంటల సమయంలో పూసపాటిరేగ పిన్నింటి కల్లాల వద్ద నుంచి వెంపడాం పైడితల్లి అమ్మవారు పండగకు బంధువుల ఇంటికి బయలుదేరి వెళ్లాడు. అయితే అతను అటు వెంపడాం చేరలేదు.. ఇటు ఇంటికీ రాలేదు. కుటుంబ సభ్యులు సమీప ప్రాంతాల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆచూకీ తెలిసిన వారు 91211 09447 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్సై కోరారు.

13 ద్విచక్ర వాహనాలు సీజ్

కొత్తవలస: సరైన పత్రాలు లేని 13 ద్విచక్ర వాహనాలను పోలీసులు సీజ్ చేశారు. మండల కేంద్రంలో సీఐ ఎస్. చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సిబ్బంది శనివారం రాత్రి వాహన తనిఖీలు చేపట్టారు. రైల్వేస్టేషన్, పాత కొత్తవలస ఆర్చి, రైల్వే క్వార్టర్స్ సమీపంలో వాహన తనిఖీలు చేపట్టి, పత్రాలు లేని వాహనాలు సీజ్ చేసి, కేసు నమోదు చేశారు. తనిఖీల్లో ఎస్సై సుదర్శన్ పాల్గొన్నారు.

తేనెటీగల దాడిలో 13 మందికి గాయాలు

కురుపాం: తేనెటీగల దాడిలో 13 మంది గాయపడిన సంఘటన మండల కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. కురుపాం మండల కేంద్రం నుంచి శివ్వన్నపేట గ్రామానికి వెళుతున్న పలువురిపై తేనెటీగలు దాడి చేశాయి. ఈ దాడిలో 13 మంది గాయపడి కురుపాం సీహెచ్‌సీలో వైద్యసేవలు పొందుతున్నారు. ప్రస్తుతం వారి పరిస్థితి బాగానే ఉందని వైద్య సిబ్బంది తెలిపారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹150	₹270	₹280

పేదల ఆరోగ్య ప్రదాయిని.. విజయనగరం సర్వజన ఆస్పత్రి

- జిల్లా ఆస్పత్రి స్థాయి పెంచి సర్వజన ఆస్పత్రిగా మార్పు
- మెరుగుపడిన వైద్యసేవలు
- అత్యవసర సేవలు సైతం అందుబాటులోకి
- తగ్గిన కేజీహెచ్ రిఫరల్స్
- పెరిగిన ఓపీ, ఐపీ సేవలు
- ఇప్పటికే మోకాళ్ల మార్పిడి, క్యాన్సర్ కణితి తొలగింపు ఆపరేషన్లు



ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి


ఐసీయూలో చికిత్స పొందుతున్న రోగులు


వైద్య పరీక్షలు చేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్లు


పలమనాలజీ విభాగంలో రోగికి మందులు వేసుకోవడంపై అవగాహన కల్పిస్తున్న వైద్యుడు

విజయనగరం ఫోర్ట్: జిల్లా ఆస్పత్రిని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిగా మార్చడంతో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయి. వైద్య సిబ్బంది మొదలుకుని మౌలిక వసతులు కల్పించడంతో పేద రోగులకు వరప్రదాయినిగా మారిందని చెప్పాలి. జిల్లా ఆస్పత్రిగా ఉన్న సమయంలో అరకొర వసతులు, వైద్య సిబ్బంది తక్కువగా ఉండడంతో సేవలు కూడా అంతంత మాత్రంగానే అందేవి. సర్వజన ఆస్పత్రిగా మారిన తర్వాత సౌకర్యాలు మెరుగుపడడంతో సేవలు కూడా మెరుగుపడ్డాయి. ప్రస్తుతం కార్పొరేట్ స్థాయిలో వైద్యసేవలు అందిస్తున్నారు. అంతేకాకుండా సూపర్ స్పెషాలిటీ సేవలైన న్యూరోసర్జరీ, న్యూరోమెడిసిన్, నెఫ్రాలజీ సేవలు కూడా అందుబాటులోకి తీసుకురానున్నారు.

- తగ్గిన రిఫరల్స్

గతంలో అత్యవసర వైద్య సేవలకు కేజీహెచ్‌కు వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం అత్యవసర కేసులకు సైతం ఇక్కడే చికిత్స అందిస్తుండడంతో కేజీహెచ్ రిఫరల్స్ బాగా తగ్గాయి. న్యూరోసర్జరీ సేవలు కూడా ఆస్పత్రిలో ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి న్యూరోసర్జరీలు అవసరం పడతాయి. సకాలంలో శస్త్రచికిత్సలు చేయడం వల్ల ఎంతోమంది ప్రాణాలు కాపాడడానికి అవకాశం ఉంటుంది.

- క్షతగాత్రులకు ఉపయోగం..

రోడ్డు ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలైన వారికి సకాలంలో (గోల్డెన్ అవర్) సర్జరీ చేయగలిగితే ప్రాణాలు కాపాడవచ్చు. సర్జరీ ఆలస్యం అయితే క్షతగాత్రులు ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుంది. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఇటువంటి సౌకర్యం లేకపోవడం వల్ల ఇంతవరకు రోగులు కేజీహెచ్‌కు గాని ప్రైవేట్ ఆస్పత్రికి గాని వెళ్లేవారు. ఇకపై న్యూరో సర్జరీ సేవలు సర్వజన ఆస్పత్రిలో లభించనుండడంతో ఎంతోమంది ప్రాణాలు నిలిచే అవకాశం ఉంది.

- క్లిష్టతరమైన శస్త్ర చికిత్సలు ప్రారంభం

ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఇప్పటికే క్లిష్టతరమైన శస్త్రచికిత్సలు ప్రారంభించారు. మోకాళ్ల మార్పిడి (నీ రీప్లేస్‌మెంట్), థైరాయిడ్ కణితులు, థైరాయిడ్ క్యాన్సర్ కణితులు, తీవ్రమైన హెర్నియా వంటి క్లిష్టతరమైన శస్త్రచికిత్సలు ఆస్పత్రిలో ఇప్పటికే జరుగుతున్నాయి. మానసిక రోగులకు షాక్ ట్రీట్‌మెంట్ (ఈసీటీ) కూడా ఆస్పత్రిలో ప్రారంభమైంది.

- నెలకు 30 వేల నుంచి 40 వేల మంది రోగులకు..

ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో నెలకు 30 వేల నుంచి 40 వేల మంది వరకు రోగులకు వైద్య సేవలు అందిస్తున్నారు. అదేవిధంగా ఏడాదికి సుమారు 5 లక్షల మంది వరకు సేవలు అందిస్తున్నారు. ఇన్‌పేషెంట్లుగా 50 వేల నుంచి 60 వేల మంది వరకు చేరుతున్నారు. ల్యాబ్ టెస్టులు 5 లక్షల నుంచి 5.50 లక్షల వరకు చేస్తున్నారు. అలాగే మేజర్ శస్త్ర చికిత్సలు సుమారు ఆరు వేలు, మైనర్ శస్త్రచికిత్సలు సుమారు 20 వేల వరకు చేస్తున్నారు.

- అందుబాటులో ఉన్న విభాగాలు..

ఆస్పత్రిలో ఈఎన్‌టీ, డెంటల్, ఎన్‌సీడీ, ఏఆర్‌టీ, కంటి, చర్మవ్యాధులు, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, పలమనాలజీ, ఎమర్జెన్సీ మెడిసిన్, న్యూరో సర్జరీ, ఫోరెన్సిక్, బయోకెమిస్ట్రీ వంటి విభాగాలున్నాయి. అదేవిధంగా డిజిటల్ ఎక్స్‌రే, ఈసీజీ, సిటి స్కాన్, ఎంఆర్ఐ స్కాన్, టూడీ ఇకో సేవలు కూడా అందుబాటులో ఉన్నాయి. అదేవిధంగా అన్ని రకాల వైద్య పరీక్షలు చేసే లేబరేటరీ కూడా ఉంది. క్యాన్సర్ నిర్ధారణ చేసే ఎఫ్ఎన్‌ఏసీ పరీక్షలు కూడా ఆస్పత్రిలో జరుగుతున్నాయి. ముఖ్యంగా యూరిన్ కల్చర్, బ్లడ్ కల్చర్ వంటి అధునాతన వైద్య పరీక్షలు కూడా నిర్వహిస్తున్నారు.

మెరుగైన వైద్యసేవలు



మా బంధువుకు ఆరోగ్యం బాగోలేదని సర్వజన ఆస్పత్రికి వెళ్లాం. అక్కడి వైద్యులు పరీక్షించి అన్ని రకాల వైద్య పరీక్షలు చేసి మందులు కూడా అందించారు. ఆమె ఆరోగ్యం ప్రస్తుతం బాగానే ఉంది. వైద్య సేవలు బాగా అందిస్తున్నారు.

– దుక్క రమణ , పెదవేమలి గ్రామం

కరాటేతో ఆత్మరక్షణ

- సత్య విద్యాసంస్థల డైరెక్టర్ మజ్జి శశిభూషణరావు


కరాటేలో తలపడుతున్న చిన్నారులు

విజయనగరం: శారీరక దారుఢ్యాన్ని పెంపొందించడంతో పాటు ఆత్మరక్షణకు కరాటే ఎంతగానో దోహదపడుతుందని సత్య విద్యాసంస్థల డైరెక్టర్ మజ్జి శశిభూషణరావు అన్నారు. నగరంలోని రాజీవ్ క్రీడా ప్రాంగణంలో కెన్ యు ర్యూ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో 17వ రాష్ట్రస్థాయి కరాటే చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం ఘనంగా జరిగాయి. కరాటే అసోసియేషన్ విజయనగరం చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ కె. సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ చాంపియన్‌షిప్ పోటీలకు సత్య విద్యాసంస్థల డైరెక్టర్ మజ్జి శశిభూషణరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కరాటే 17వ రాష్ట్రస్థాయి చాంపియన్‌షిప్ పోటీలను విజయనగరంలో నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. పోటీల్లో గెలుపోటములు సహజమని, చిన్నారులు క్రీడా స్ఫూర్తితో పోటీల్లో పాల్గొనాలని సూచించారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సుమన్, చాంపియన్‌షిప్ చీఫ్ ఆర్గనైజర్ సంతోష్‌కుమార్ మాట్లాడుతూ.. పోటీల నిర్వహణకు అన్ని విధాలుగా సహకరించిన సత్యా విద్యా సంస్థల డైరెక్టర్ శశిభూషణరావుకు ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో రిఫరీలు, న్యాయమూర్తులు, కోచ్‌లు, క్రీడాకారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆరుగురికి గాయాలు

- ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ఆటో


సంఘటనా స్థలంలో ఆటో, స్కూటీ


108 వాహనంలో క్షతగాత్రులు

రామభద్రపురం: మండల కేంద్రంలోని సాలూరు రూట్‌లో ఉన్న వై జంక్షన్ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురికి గాయాలయ్యాయి. పోలీసులు తెలియజేసిన వివరాలు ఇలా ఉన్నాయి. పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం మండలం పల్లంతేవిడి గ్రామానికి చెందిన పెద్దింటి చలపతి రావు, పాలక రాజీవ్ ద్విచక్రవాహనంపై సాలూరు నుంచి రామభద్రపురం వైపు వస్తుండగా.. అదే సమయంలో రామభద్రపురం నుంచి మక్కువ వెళుతున్న ఆటో వీరిని ఢీకొట్టింది. దీంతో ద్విచక్ర వాహనంపై ఉన్న ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. అలాగే ఆటోలో 8 మంది ప్రయాణిస్తుండగా అందులో రామభద్రపురం ఎగువ హరిజనవీధికి చెందిన గొల్లపల్లి పార్వతి, పార్వతీపురం మన్యం జిల్లా కొమరాడ మండలం గుమడ గ్రామానికి చెందిన సారిపి అనూష, పార్వతీపురం పట్టణం రెల్లివీధికి చెందిన రాజాన అంకితలతో పాటు మరొకరికి గాయాలయ్యాయి. స్థానికులు స్పందించి క్షతగాత్రులను 108 వాహనంలో బాడంగి సీహెచ్‌సీకి తరలించారు. తీవ్రగాయాలపాలైన ద్విచక్ర వాహనదారులు చలపతిరావు, రాజీవ్‌లను మెరుగైన చికిత్స కోసం బాడంగి నుంచి విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ద్విచక్రవాహనదారుల కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై జ్ఞానప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మల్లన్న సన్నిధిలో ఎంపీ, ఎమ్మెల్యే


మల్లన్న సన్నిధిలో పూజలు చేస్తున్న ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే బడ్డుకొండ, తదితరులు

పూసపాటిరేగ: కర్నూలు జిల్లా శ్రీశైలంలో వెలసిన మల్లికార్జునస్వామిని విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు వారికి ఆలయ సంప్రదాయం ప్రకారం వారికి స్వాగతం పలికారు. దగ్గరుండి స్వామివారి దర్శనం చేయించి, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ ఏడాది వర్షాలు అనుకూలంగా ఉండాలని, పంటలు బాగా పండాలని, అన్నదాతలు సుభిక్షంగా ఉండాలని కోరుకున్నట్లు చెప్పారు.

వ్యాన్ ఢీకొని వ్యక్తి మృతి


సంఘటనా స్థలంలో తాతాబాబు మృతదేహం

బొండపల్లి: మండలంలోని అంబటివలస – గొట్లాం గ్రామాల మధ్య జాతీయ రహదారి 26పై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్సై కె.లక్ష్మణరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విజయనగరం మండలం గుంకలాం గ్రామానికి చెందిన తాడ్డి తాతబాబు (35) అదే మండలంలోని కొండకరకాం గ్రామంలో ఒక వ్యక్తి వద్ద ట్రాక్టరు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. విధులు ముగించుకుని తన ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తుండగా విజయనగరం వైపు నుంచి వస్తున్న వ్యాన్ బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తాతబాబు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడినికి భార్య సంతోషి, మూడేళ్ల వయసున్న కుమార్తె అనూ ఉన్నారు. కుటుంబ పెద్ద చనిపోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కేంద్ర సర్వజన ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కీటక జనిత వ్యాధులకు చెక్

- ముమ్మరంగా నియంత్రణా చర్యలు
- పార్వతీపురం – మన్యం జిల్లాలో 401 మలేరియా ప్రభావిత గ్రామాలు
- కొనసాగుతున్న మొదటి విడత ఏసీఎం 5 శాతం మందు పిచికారీ పనులు


వంగర గ్రామంలో మలేరియా మందు పిచికారీ (ఫైల్)

గుమ్మలక్ష్మీపురం: కీటక జనిత వ్యాధుల నియంత్రణ కార్యక్రమం పార్వతీపురం మన్యం జిల్లాలో ముమ్మరంగా కొనసాగుతోంది. ముఖ్యంగా మలేరియా, డెంగీ వంటి వ్యాధుల బారిన ప్రజలు పడకుండా ఈ వ్యాధులను కలుగజేసే దోమల నియంత్రణకు జిల్లా మలేరియా నివారణ అధికారులు చర్యలు చేపడుతున్నారు. జిల్లాలో గల 12 మండలాల్లోని 28 పీహెచ్‌సీల పరిధిలో 401 మలేరియా ప్రభావిత గ్రామాలను గుర్తించారు. ఈ గ్రామాల్లో ఈనెల 15వ తేదీ నుంచి మొదటి విడత దోమల మందు (ఏసీఎం 5 శాతం) పిచికారీ చేపడుతున్నారు. జూన్ నెలాఖరులోగా ఎంపిక చేసిన గ్రామాల్లో పిచికారీ పూర్తి చేసేందుకు లక్ష్యంగా నిర్ణయించుకున్నారు. ఇప్పటికే పలు గిరిజన, గిరిశిఖర గ్రామాల్లో దోమల మందు పిచికారీని పూర్తిచేశారు. పిచికారీకి సంబంధించిన ప్రణాళికకు సంబంధిత శాఖ ఉన్నతాధికారులు ఆమోదం తెలిపడంతో పాటు నెల రోజుల ముందుగానే వైద్య సిబ్బందికి (ఎన్‌వీబీడీసీ పరిధిలో) రీ ఓరియెంటేషన్ ట్రైనింగ్ కూడా ఇచ్చారు. వైద్య శాఖ అధికారులు, సిబ్బంది, సంబంధిత శాఖల సమన్వయంతో మొదటి విడత పిచికారీ అధికారుల పర్యవేక్షణలో కొనసాగుతోంది.

- 132 గ్రామాల్లో పిచికారీ పూర్తి

జిల్లాలోని 7 సబ్ యూనిట్ల పరిధిలోని 28 పీహెచ్‌సీల పరిధిలో గల 132 గ్రామాల్లో మలేరియా నివారణ మందు మొదటి విడత పిచికారీ పనులు పూర్తయ్యాయి. ఈమేరకు గుమ్మలక్ష్మీపురం మండలంలో 19 గ్రామాల్లో.. కురుపాం మండలంలో 7 గ్రామాల్లో.. కొమరాడ మండలంలో 19 గ్రామాల్లో.. పార్వతీపురం మండలంలో 22 గ్రామాల్లో.. సాలూరు మండలంలో 12 గ్రామాల్లో.. పాచిపెంట మండలంలో 14 గ్రామాల్లో.. సీతంపేట మండలంలో 23 గ్రామాల్లో.. భామిని మండలంలో 10 గ్రామాల్లో.. వీరఘట్టం మండలంలో 5 గ్రామాల్లో మొదటి విడత ఏసీఎం ఐదు శాతం మందు పిచికారీ పనులు పూర్తయ్యాయి.

- డెంగీ లక్షణాలు..

డెంగీ వ్యాధి ఎడిస్ దోమల ద్వారా వ్యాప్తి చెందుతుంది. హఠాత్తుగా వచ్చే తీవ్రమైన జ్వరం, ఎముకలు, కండరాల్లో భరించలేని నొప్పి, శరీరంపై దద్దుర్లు, వాంతులు, వికారం, రక్తస్రావం వంటి లక్షణాలు కనిపిస్తాయి. దీని నిర్ధారణకు క్షేత్ర స్థాయిలో ఎన్ఎస్–1 కిట్లు ఉపయోగిస్తున్నారు. డెంగీ తుది నిర్ధారణకు జిల్లాల్లో రెండు ఎస్ఎస్‌హెచ్ కేంద్రాలున్నాయి. ఒకటి పార్వతీపురంలోని జిల్లా ఆస్పత్రి కాగా రెండోది పాలకొండలోని ప్రాంతీయ ఆస్పత్రి.

- మలేరియా లక్షణాలు..

ఎనాఫిలస్ దోమల ద్వారా ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుంది. చలి, వణుకుతో కూడిన జ్వరం విడిచి, విడిచి రావడం దీని లక్షణం. దీని నిర్ధారణకు ఆస్పత్రుల్లో ర్యాపిడ్ కిట్లు, రక్త పూతల స్లైడ్స్ ఉపయోగిస్తున్నారు. జిల్లాలోని దుడ్డుఖల్లు, మాదలింగి, రేగిడి, తోణాం, జీఎన్ పేట, దోనుబాయి, నీలకంఠాపురం, తాడికొండ, కేఆర్బీపురం పీహెచ్‌సీల పరిధిలో ఈ ఏడాది మలేరియా కేసులు నమోదయ్యాయి.

ముమ్మరంగా నివారణ చర్యలు



మలేరియా, డెంగీ గుర్తించిన గ్రామాల్లో ఏసీఎం ఐదు శాతం ద్రావణం పిచికారీ, ఫాగింగ్, ఫీవర్ సర్వేలెన్స్‌తో పాటు అన్ని ప్రాంతాల్లో డ్రైడే కార్యక్రమాలు నిర్వహిస్తూ మలేరియా, డెంగీ నియంత్రణకు కృషి చేస్తున్నాం. ఆయా మండలాలు, పట్టణాల్లో జ్వరాలు, దోమల నియంత్రణ, పారిశుధ్యం, పరిసరాల పరిశుభ్రత అంశాలపై సమన్వయ సమావేశాలు నిర్వహిస్తున్నాం. దోమల నివారణ కోసం చేపడుతున్న పిచికారీ పనులు ఎంపిక చేసిన గ్రామాల్లో సజావుగా సాగుతోంది.

– డాక్టర్ టి.జగన్ మోహనరావు, జిల్లా మలేరియా నివారణ అధికారి, పార్వతీపురం మన్యం



అ'పూర్వ' కలయిక


1990 -91 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

విజయనగరం పూల్‌బాగ్: నెల్లిమర్ల నగర పంచాయతీలో గల గవర్నమెంట్ సీకేఎంజీజే స్కూల్ 1990–91 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు జిల్లా కేంద్రంలోని ఓ హోటల్‌లో ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించడంతో పాటు చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ సందడిగా గడిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

FOR SALE

1Ac Mango Garden for Sale at Gurla, 100 Mts from Highway, Beside BBR Layout. Ph: 9052249333 [WB-7704]

WANTED

Wanted Team Leaders ADMS E-Bikes Showroom. Salary 20,000/- +Incentive*, Work from Home Town. Call me : 8897221102, 7095604513. [S-1236729]

గెస్ట్ హౌస్‌లో పనిచేయుటకు హౌస్ కీపింగ్ బాయ్స్ కావలెను. ఉచిత రూం + భోజనం, జీతం : 12K. ○ రైల్వే వర్క్ వద్ద సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. ఫొటో, బయోడేటా వాట్సాప్ చేయండి. జీతం : 18K. RSR వైజాగ్. ఫోన్ : 73065 82829 [V- 1563]

ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సప్ చేయగలరు. 95026 15217 [M-1185091]

త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ /నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 18K. ఫోన్: 9160900024 / 9640400073 [HA-167]

కన్సల్టెన్సీ కాదు. VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీ/పురుషులు, ఆయా, నర్సులు, వంటచేయవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15000–40000, ఫ్రీ రూమ్ + భోజనం. HYD. ఫోన్: 8317512135 [HA-153]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.